సాక్షి మంచిర్యాల

గురువారం । 1 । జూన్ । 2023



దశాబ్ది ఉత్సవాలకు ఆహ్వానం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో నిర్వహించే దశాబ్ది ఉత్సవాలకు రావాలని డీసీపీ సుధీర్‌రాంనాథ్ కేకన్‌ను జీఎం మోహన్‌రెడ్డి ఆహ్వానించారు.

నేడు స్థాయీ కమిటీ సమావేశం

మంచిర్యాలక్రైం: జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం స్థాయీ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో నరేందర్ తెలిపారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య, వైద్య సేవలు, మహిళా సంక్షేమం, సాంఘిక సంక్షేమం, నిర్మాణ పనులు, ప్రణాళిక, ఆర్థిక తదితర అంశాలపై కమిటీ సమావేశాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.0 /28.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. గరిష్ట ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేడు ప్రభుత్వ విప్ సుమన్ పర్యటన

చెన్నూర్: ప్రభుత్వ విప్ బాల్క సుమన్ గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నెల 9న ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించనున్న ఐడీఓసీ కలెక్టరేట్ కార్యాలయం, బహిరంగ సభ స్థలం పరిశీలిస్తారు. చెన్నూర్ పట్టణంలోని సాయిరాం ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల విజయవంతం కోసం నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, అధికారులుతో సన్నాహక సమావేశంలో పాల్గొంటారు.

కన్నుల పండువగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



ధ్వజస్తంభం వద్ద ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ బాబు క్యాంపు బస్తీలోని శివభక్త మార్కండేయ గణపతి, శారదమాత ఆలయంలో బుధవారం విఘ్నేశ్వర సహిత ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన జరిగింది. అంతకుముందు పద్మశాలీలు ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిష్ఠాంగ హోమములు, ప్రాణప్రతిష్ఠ, బలిదానం మహోవేదన నివేదనము, పూర్ణాహుతి, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ఎమ్మెల్సీ ఎల్.రమణ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. భక్తులు, పద్మశాలీ శ్రేణులు భారీగా తరలి వచ్చారు. మూడు రోజులపాటు ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు.

పొగాకు వాడకానికి దూరంగా ఉండాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ, చైర్మన్

నస్పూర్: పొగాకు వాడకానికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు, మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్ తెలిపారు. బుధవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పట్టణంలో పొగాకు వాడకం వల్ల వచ్చే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని నస్పూర్ కాలనీలో 'మాకు ఆహారం కావాలి.. పొగాకు కాదు అని' నినదిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ, చైర్మన్ మాట్లాడుతూ 18ఏళ్లలోపు పిల్లలకు పొగాకు అమ్మడం, వారితో పొగాకు అమ్మించడం చట్టరీత్యా నేరమని చెప్పారు. పొగాకుకు సంబంధించిన ప్రకటనలు చేయడం, బహిరంగ ప్రదేశాల్లో పొగాకు వాడకం నేరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ విజయపూర్ణిమ, డాక్టర్ అనిత, డాక్టర్ సమత, రత్నమాల, డాక్టర్లు, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

జైపూర్, గంగిపల్లి ఉపకేంద్రాల పరిశీలన



బాలింతలతో మాట్లాడుతున్న అధికారులు

జైపూర్: జైపూర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని జైపూర్, గంగిపల్లి ఆరోగ్య ఉపకేంద్రాల పనితీరును జిల్లా డివిజన్ అధికారులు రామ్మూర్తి, అల్లాడి శ్రీనివాస్ బుధవారం సందర్శించారు. ఆయా కేంద్రాల్లో అందుతున్న మాతాశిశు సంరక్షణ సేవలను తెలుసుకుని రికార్డులు పరిశీలించారు. వ్యాధి నిరోధక టీకాల కేంద్రాన్ని పర్యవేక్షించారు. నీళ్ల విరేచనాల నియంత్రణ కార్యక్రమంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రల పంపిణీ, విటమిన్-ఏ ద్రావణాన్ని 9నెలలు నుంచి ఐదేళ్ల మధ్య వయస్సు గల పిల్లలందరికీ మింగించాలని తెలిపారు. స్థానిక ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

హరితహారానికి సన్నద్ధం

- గ్రామ నర్సరీల్లో 94శాతం మొక్కలు
- ఈ ఏడాది లక్ష్యం 23లక్షల మొక్కలు
- తొమ్మిదో విడతకు ప్రత్యేక కార్యాచరణ



జనగామలో నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో శేషాద్రి

కోటపల్లి: జిల్లాలో మొక్కల పండుగను రంగం సిద్ధమైంది. తొమ్మిదో విడత హరితహారం ప్రారంభానికి అధికార యంత్రాంగం సమాయత్తం అవుతోంది. ప్రతీ గ్రామంలోని నర్సరీలో మొక్కల పెంపకం కోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోంది. జిల్లాలోని 311 గ్రామ పంచాయతీల్లో ఈ ఏడాది 23లక్షల మొక్కలు నాటాలని అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించుకోగా.. అందుకు తగ్గట్లుగా పంచాయతీల్లో మొక్కల పెంపకం చేపట్టారు. జిల్లాల్లోని నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉండగా..అన్ని శాఖల ఆధ్వర్యంలో నాటేందుకు చర్యలు చేపడుతున్నారు. పల్లెల్లో, పట్టణాల్లో పచ్చదనం వెల్లివిరిసేలా చర్యలు తీసుకుంటున్నారు. గతంలో నాటిన మొక్కలు ఎండిపోయిన వాటి స్థానంలో కొత్తవి నాటడం, ఖాళీ ప్రభుత్వ స్థలాలు, రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటనున్నారు. జిల్లాలోని 16 మండలాల్లో ఉన్న 311 గ్రామ పంచాయతీల్లో 23,16,393 మొక్కలు పెంచుతున్నారు. నర్సరీల్లో పూలు, పండ్ల మొక్కలతోపాటు ఇతర మొక్కలు పెంచుతున్నారు. కూలీలను నియమించి ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకుంటున్నారు. ఎండ వేడి నుంచి తట్టుకునేలా గ్రీన్ నెట్ వేస్తున్నారు.

పచ్చదనానికి ప్రాధాన్యం

గ్రామాల్లో పచ్చదనం వెల్లివిరియాలని, పట్టణాలన్నీ మొక్కలతో కళకళలాడాలనే బృహత్తర లక్ష్యంతో ప్రభుత్వం హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందుకు అనుగుణంగా ఏటా మొక్కలు నాటడంతోపాటు సంరక్షణకు ప్రాధాన్యమిస్తోంది. పలు ప్రాంతాల్లో మొక్కలు ఏపుగా పెరిగి ఆ ప్రాంతానికి కొత్త అందాన్ని ఇవ్వడంతోపాటు వాతావరణ కాలుష్య నివారణకు తోడ్పడుతున్నాయి. ఈసారి హరితహారంలో ప్రతీ ఇంటికి మూడు మొక్కలు పంపిణీ చేయనున్నారు. మామిడి, కరివేపాకు, పూలమొక్కలు అందజేయనున్నారు. అధికారులు ఇళ్ల వివరాలు సేకరించి సిద్ధం చేశారు.

ఏపుగా పెరిగాయి..

ఎండల ప్రభావం తీవ్రంగా ఉన్నా నర్సరీల్లో మొక్కలకు ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టారు. చాలా నర్సరీల్లోని మొక్కలు ఏపుగా పెరిగి పచ్చగా కళకళలాడుతున్నాయి. అధికారులు గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించి సూచనలు చేయడంతో పల్లె ప్రకృతి, బృహత్ వనాల్లో ఆహ్లాదకరంగా కనిపిస్తున్నాయి.

జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఈ ఏడాది లక్ష్యం

మున్సిపాలిటీ	మొక్కలు
మంచిర్యాల	2,52,010
చెన్నూర్	75,000
మందమర్రి	1,28,500
నస్పూర్	1,58,730
బెల్లంపల్లి	1.50,000
లక్సెట్టిపేట	10,145
క్యాతన్‌పల్లి	86,000
మొత్తం	8,60,385

సిద్ధం చేశాం



జూన్ రెండో వారంలో మొక్కలు నాటేందుకు అన్ని పంచాయితీల్లోని నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేశాం. ఎప్పటికప్పుడు కార్యదర్శులను అందుబాటులో ఉంచుతూ రక్షణ చర్యలు చేపట్టాం. జిల్లాలోని నర్సరీల్లో మొత్తం 23లక్షల మొక్కలు సిద్ధంగా ఉన్నాయి.

– శేషాద్రి, డీఆర్‌డీవో మంచిర్యాల

పకడ్బందీ చర్యలు చేపడుతాం



గతంలో జరిగిన పొరపాట్లు ఈసారి జరగకుండా చూస్తాం. నాటిన ప్రతీ మొక్కను సంరక్షించేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతాం. మాస్ ప్లాంటేషన్ల ఏర్పాటు కోసం ఇప్పటి నుంచే స్థలాలను గుర్తిస్తున్నాం. గతంలో నాటిన మొక్కలను కాపాడకుండా చనిపోయిన ప్రాంతాలను గుర్తించి మళ్లీ మొక్కలను నాటుతాం. మొక్కల సంరక్షణ బాధ్యతలను ఆయా వార్డు అధికారులకు అప్పగిస్తాం. హరితహారం వందశాతం లక్ష్యాన్ని ప్రణాళికబద్ధంగా పూర్తి చేస్తాం.

– గంగాధర్, మున్సిపల్ కమిషనర్, చెన్నూర్

పురపాలికల్లో 8.60 లక్షల మొక్కలు



చెన్నూర్ ప్రకృతివనంలో మొక్కలు

చెన్నూర్: జిల్లాలోని మున్సిపాలిటీల్లో హరితహారం విజయవంతానికి అధికార యంత్రాంగం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తోంది. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలలో మాస్ ప్లాంటేషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. బల్దియాల్లో పచ్చదనం వెల్లివిరిసే విధంగా ముందస్తు చర్యలు చేపడుతోంది. అవెన్యూ ప్లాంటేషన్లు, ఫ్లవర్ ప్లాంటేషన్లు ఏర్పాటు చేసేందుకు ముందుగా స్థలాలు గుర్తించి ఆయా ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈసారి హరితహారాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నారు.

సంరక్షణ చర్యలు లేక..

జిల్లాలోని పురపాలికల్లో గతంలో నిర్వహించిన హరితహారంలో ఆశించిన ఫలితాలు రాలేదని ఆరోపణలు ఉన్నాయి. మున్సిపాలిటీల్లో వందశాతం మొక్కలు నాటితే 20 శాతం ఫలితం కానరాలేదు. పాఠశాలలు, రోడ్లకు ఇరువైపుల మొక్కలు నాటి గాలికి వదిలేశారు. దీంతో ఆశించిన ఫలితం రాలేదు. ఈసారి అన్ని శాఖల సమన్వయంతో వార్డుల్లో విస్తృతంగా మొక్కలు నాటేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పట్టణ ప్రణాళిక సభ్యులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. గతంలో జరిగిన పొరపాట్లను అధిగమించి బల్దియాల్లో వందశాతం పచ్చదనం వెల్లివిరిసే విధంగా ప్రణాళిక రూపొందిస్తున్నారు.

మాస్ ప్లాంటేషన్ల స్థలాల గుర్తింపు

ఈసారి ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాల్లో మాస్ ప్లాంటేషన్ల ఏర్పాటుకు స్థలాలను గుర్తిస్తున్నారు. మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు ఆయా శాఖల అధికారులకే అప్పగించే ఆలోచనలో జిల్లా ఉన్నతాధికారులు ఉన్నట్లు తెలిసింది. మొక్కలకు ట్రీగార్డులతోపాటు సపోర్ట్ కర్రలను ఏర్పాటు చేసి నీటి వసతి కల్పించాలని కమిషనర్లు యోచిస్తున్నారు.

దశాబ్ది ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలి

- రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీధర్
- ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్, సంతోష్

నస్పూర్: తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి పదో సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన దశాబ్ది ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీధర్ అన్నారు. బుధవారం ఆయన సీసీసీ నస్పూర్ సింగరేణి గెస్ట్‌హౌజ్‌లో దశాబ్ది ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టర్ బాదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ బి.రాహుల్, ట్రెయినీ కలెక్టర్ పి.గౌతమి, డీఎఫ్‌వో శివ్ఆశిష్ సింగ్, డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్‌తో కలిసి జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ జూన్ 2 నుంచి 22వరకు నిర్వహించే ఉత్సవాలను వివిధ శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని అన్నారు. జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో వేడుకలు నిర్వహించాలని సూచించారు. రైతు దినోత్సవం సందర్భంగా రైతుల కోసం ప్రభుత్వం చేపట్టిన పథకాలు, ప్రభుత్వం సాధించిన పురోగతి, అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలందరికీ తెలిసేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని అన్నారు. విద్యుత్ రంగంలో సాధించిన గుణాత్మక మార్పులు, విజయాలను ఫ్లెక్సీల రూపంలో తెలియజేయాలని చెప్పారు. సాగునీటి రంగంలో సాధించిన ప్రగతి, కవి సమ్మేళనాలు, తెలంగాణ రన్, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ల పంపిణీ, పల్లెప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాలపై వివరించాలని సూచించారు.

కోఆపరేటివ్ సొసైటీని ప్రారంభించిన కేంద్ర మంత్రి

మంచిర్యాలఅగ్రికల్చర్: మత్స్యగంధి మల్టీ స్టేట్ ఫిషర్‌మెన్ కో ఆపరేటివ్ సొసైటీని జిల్లా కేంద్రం మంచిర్యాలలోని ఎస్‌బీఐ గర్మిళ్లశాఖలో కేంద్ర మత్స్యశాఖ మంత్రి పురుషోత్తం రూపాలా ఆన్‌లైన్‌లో బుధవారం ప్రారంభించారు. మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణ, జిల్లా సహకార అధికారి డి.కృష్ణ, సహకార భారతి రాష్ట్ర కార్యదర్శి పొన్నాల యాదగిరి, మల్టీస్టేట్ ఫిషర్‌మెన్ కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు పుల్లబోయిన భీమయ్య, డైరెక్టర్లు నర్సింలు, రామేశ్వరీ, ఎల్లయ్య పాల్గొన్నారు.

రైతులకు చైతన్యమేది..?

- కానరాని మన తెలంగాణ–మన వ్యవసాయం
- రెండేళ్లుగా కార్యక్రమాలు కరువు



గుడిపేట శివారులో పొలం పనుల్లో రైతులు(ఫైల్)

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పంటల సాగులో రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్వహించే మన తెలంగాణ– మన వ్యవసాయం కార్యక్రమాలు రెండేళ్లుగా నిలిచిపోయాయి. ఏటా ఏప్రిల్, మే నెలల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మెలకువలు, యంత్ర రాయితీ, పంటల బీమా తదితర అంశాలపై గతంలో సదస్సులు నిర్వహించి చైతన్యం చేసే వారు. పంచాయతీ కార్యదర్శి, మండల వ్యవసాయ విస్తరణాధికారులు గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు రైతులతో నేరుగా మమేకమై వ్యవసాయం, సాగు అంశాలపై వివరించేవారు. భూసార పరీక్షలపై అవగాహన, పంటల మార్పిడి, పంటలకు మద్దతు ధర లేనప్పుడు ధాన్యం గోదాముల్లో నిల్వ చేయడం, నిల్వ ధాన్యంపై రుణం పొందే విధానం, వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా సాగు చేయాల్సిన పంటలు, రుణాల సద్వినియోగం, పంటలను ఆశించే చీడపీడల నివారణ, కరువు కోరల్లో చిక్కుకున్నప్పుడు పాడి పశువుల అభివృద్ధి, పశుసంవర్థక శాఖ రాయితీలు, విత్తన ఉత్పత్తికి ప్రోత్సాహం, విద్యుత్ వినియోగం తదితర అంశాలపై అధికారులు అవగాహన కల్పించేవారు. రెండేళ్లుగా చైతన్యయాత్రల ఊసే లేకపోవడంతో ఒకే రకం పంట, అధిక మోతాదులో రసాయనిక ఎరువులు వాడుతూ రైతులు నష్టపోతున్నారు.

రైతువేదికల ఉపయోగం నామమాత్రం

రైతులకు అన్ని విధాలుగా ఉపయోగపడేలా ఏర్పాటు చేసిన రైతు వేదికలు ప్రస్తుతం ఏఈఓ కేంద్రాలుగా మార్చారు. జిల్లా వ్యాప్తంగా 55 క్లస్టర్లుగా ఏర్పాటు చేసి 55 రైతువేదిక భవనాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. రైతులకు అవగాహన కల్పించేందుకు రైతువేదికలు అందుబాటులో ఉన్నా ఏమాత్రం ఉపయోగపడడం లేదు. రైతువేదికలకు రావడానికి రైతులు ఆసక్తి చూపకపోవడంతో ఏఈఓలు కూడా వచ్చిన కొద్ది మందికి అవగాహన కలిపిస్తూ మమ అనిపిస్తున్నారు. వ్యవసాయాధికారులు కూడా సలహాలు, సూచనలు ఇవ్వడం లేదని కొందరు రైతులు వాపోతున్నారు. నామమాత్రంగా అవగాహన, చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తూ చేతులు దులిపేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. రూ.లక్షలు ఖర్చు చేసి కుర్చీలు, టేబుళ్లు, మైక్‌సెట్ ఇలా అన్ని రకాల మౌలిక వసతులతో ఏర్పాటు చేసిన రైతువేదికల నిర్వహణకు ప్రతీ నెల రూ.9 వేలు అందజేస్తుండగా దాదాపు 10 నెలలకు పైగా నిర్వహణ ఖర్చులు రావడం లేదు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి రైతులను చైతన్యం చేయాలని కానీ ఇలా రైతువేదికల్లోనే అధికారులు ఉండి సలహాలు, సూచనలు అందిస్తామంటే రైతువేదికల వద్దకు వచ్చే పరిస్థితులు లేవని అంటున్నారు.

చైతన్యయాత్రలు నిర్వహించాలి..



పంట సాగుకు ముందు రైతులు వేసుకునే పంటలు, సాగు పద్ధతులపై అవగాహన కల్పించేలా రైతు చైతన్యయాత్రలు నిర్వహించాలి. గతంలో గ్రామగ్రామాన చైతన్యయాత్రలు ఉండగా ఇప్పుడు ఆ ఊసే కని పించడం లేదు. ఊరూరా రైతు చైతన్యయాత్రలు నిర్వహించి రైతులను చైతన్యం చేయాలి.

– దుర్గప్రసాద్, రైతు, గ్రామం : తాళ్లపేట, మం: దండేపల్లి

ఏఈఓలను సంప్రదించాలి



రైతులకు ఎలాంటి సలహాలు, సూచనలు అవసరమున్నా రైతువేదికల్లో అందుబాటుల్లో ఉన్న ఏఈఓలని సంప్రదించాలి. ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉంటూ సాగు మెలకువలు, సాగు పద్ధతులపై చైతన్యం చేస్తాను. సలహా, సూచనలతోపాటు సాగు సేవలు అందుతాయి. మన తెలంగాణ–మన వ్యవసాయం కార్యక్రమాలు రెండేళ్లుగా నిలిచిపోగా ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం లేదు.

– కల్పన, జిల్లా వ్యవసాయాధికారి, మంచిర్యాల

ఇక బడిబాట

- నేటి నుంచి పాఠశాలలకు ఉపాధ్యాయులు
- సన్నద్ధత కార్యక్రమాలపై సమీక్ష
- 2న ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
- 3నుంచి 9వరకు బడిబాట
- కొత్త ప్రవేశాలపై దృష్టి



మంచిర్యాల బాలుర ఉన్నత పాఠశాల

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో వేసవి సెలవుల అనంతరం 40 రోజుల తర్వాత సర్కారు పాఠశాలలు తెరుచుకోనున్నాయి. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కావాల్సి ఉండగా జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ వేడుకల నేపథ్యంలో ఉపాధ్యాయులు జూన్ 1నుంచి బడిబాట పట్టనున్నారు. పాఠశాలల్లో సన్నద్ధత కార్యక్రమాలపై చర్చించనున్నారు. జూన్ 3నుంచి 9 వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల నమోదు కోసం ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 7గంటల నుంచి 11 గంటల వరకు ఉపాధ్యాయులు బ్యానర్లు, పోస్టర్లను ప్రదర్శిస్తూ, కరపత్రాలు పంచుతూ ఇంటింటా ప్రచారం చేపట్టనున్నారు. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. 13 నుంచి 17వరకు రోజుకో కార్యక్రమం మన ఊరు–మనబడి, సామూహిక అక్షరాభ్యాసం, బడిబయట పిల్లల నమోదు, ఆంగ్ల మాధ్యమం ప్రవేశంపెట్టడం, బాలిక విద్య, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించనున్నారని డీఈవో యాదయ్య తెలిపారు.

బలోపేతమే లక్ష్యంగా..

జిల్లాలో 1,049 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో 1,16,072 మంది విద్యార్థులు చదువుతున్నారు. గతేడాది ఒకటి నుంచి 8వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టారు. తెలుగు మీడియంలో 107 మంది చేరగా ఇంగ్లిష్ మీడియంలో 3,880 మంది విద్యార్థులు ప్రవేశం పొందారు. ఈ ఏడాది ప్రవేశాలు రెట్టింపు చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. 2023–24 విద్యాసంవత్సరం సర్కారు బడుల బలోపేతమే లక్ష్యంగా బడిబాట కార్యక్రమం నిర్వహించనున్నారు. జూన్ 3నుంచి 9వరకు ఎన్‌రోల్‌మెంట్ చేపట్టనున్నారు. ఉదయం 7గంటల నుంచి 11వరకు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేపట్టనున్నారు.

ఇందుకు అవసరమైన ర్యాలీలు, కరపత్రాల పంపిణీ, బడిబయట పిల్లలు, బాలలు, బాలకార్మికులు, గుర్తించి బడుల్లో చేర్పించనున్నారు. బడీడు పిల్లలను గుర్తించి, వారిని స్కూళ్లలో చేర్పించనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఐదేళ్లు నిండిన పిల్లలను గుర్తించి వారిని ప్రభుత్వ స్కూళ్లలో చేర్పిస్తారు. ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు పెంచనున్నారు. అంగన్‌వాడీ పిల్లలను ఒకటో తరగతిలో చేర్పించడం, ఐదో తరగతి పిల్లలను 6వ తరగతిలో ప్రవేశాలు కల్పించనున్నారు.

ఆంగ్ల మాధ్యమంతో..

ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ మార్పులకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ బడుల్లో ఆంగ్ల బోధన సాగనుంది. ఇప్పటికే 714 పాఠశాలల్లో 294 బడుల్లో తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో బోధన సాగుతోంది. ఈ ఏడాది తొమ్మిదో తరగతిలో ఆంగ్ల మాధ్యమం అమలు చేయనున్నారు. ఇప్పటికే ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు అన్నీ ఉచితంగానే అందిస్తోంది. ఉచిత ప్రవేశం.. మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, రెండు జతల యూనిఫామ్, శిక్షణ పొందిన బోధన, విశాలమైన తరగతి గదులు సర్కారు బడిలో ఉన్నాయనే ప్రచారంతోపాటు వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నారు.

పాఠశాలలు	సంఖ్య		
ప్రభుత్వ,లోకల్‌బాడీ స్కూల్	714		
కేజీబీవీ	18		
ఆదర్శ	05		
తరగతి	బాలురు	బాలికలు	మొత్తం
1–8వరకు	17,995	17938	35933
9నుంచి 10వరకు	4771	4912	9683
11,12వరకు	418	1646	2064
మొత్తం	23184	24496	47680

రైతుల ఆందోళనకు దిగొచ్చిన అధికారులు



అధికారులకు సూచనలు చేస్తున్న ప్రేమ్‌కుమార్

నెన్నెల: అన్నదాతల ఆందోళనకు అధికారులు దిగొచ్చారు. రెండో రోజు బుధవారం మండలంలోని గొల్లపల్లి ఐకేపీ కొనుగోలు కేంద్రం ఎదుట రైతుల ఆందోళన వద్దకు చేరుకుని వారితో మాట్లాడారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, లారీల కొరత లేకుండా చూస్తామని, ప్రతీ గింజ కొనుగోలు చేస్తామని జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రేమ్‌కుమార్ అన్నారు. లారీల కొరత లేకుండా చూస్తామని రైతులకు నచ్చజెప్పారు. కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి సరైన వసతులు లేకపోవడంతో ఐకేపీ సిబ్బందిపై మండిపడ్డారు. తూకం వేసిన ధాన్యానికి రశీదులు ఎందుకు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. తూకం వేసిన ధాన్యం బాధ్యత నిర్వాహకులదేనని చెప్పారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలని, అకాల వర్షానికి ధాన్యం తడవకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఐకేపీ సిబ్బందిపై కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు చెప్పారు. రైతులు మూడు గంటలపాటు అధికారులను చుట్టుముట్టి సమస్యలు వివరించారు. డీసీఎస్‌ఓ దగ్గర ఉండి తూకం వేసిన ధాన్యానికి రశీదులను రైతులకు ఇప్పించారు. రైతుల ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పడంతో శాంతించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భూమేశ్వర్, ఎస్సై శ్యాంపటేల్, ఏపీఎం విజయలక్ష్మీ పాల్గొన్నారు.

'జాతీయ కార్మిక సంఘాల ఓటు బ్యాంకు రాజకీయాలు'

పాతమంచిర్యాల: జాతీయ కార్మిక సంఘాలు ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కామెర గట్టయ్య విమర్శించారు. బుధవారం జిల్లా కేంద్రంలో తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని బొగ్గు గని కార్మికులు పోరాటాలకు సిద్ధంగా ఉన్న సమయంలో కోలిండియా యాజమాన్యం, ప్రభుత్వంతో కార్మిక సంఘాలు చేతులు కలిపి కార్మికులకు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. మోసపూరిత కార్మిక సంఘాల నాయకులు గనులపైకి వస్తే నిలదీయాలని పిలుపునిచ్చారు. 11వ వేజ్‌బోర్డు సంఘం నిర్మాణాల ఎజెండాపై చర్చించి తీర్మానాలు చేశారు. తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కో కన్వీనర్ నీరటి రాజన్న, ఉపాధ్యక్షుడు దేవి సత్యం, దాసరి జనార్దన్, నాయకులు గొడిశెల శ్రీహరి, వెంగల కనకయ్య, జైపాల్‌సింగ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

విదేశాల్లో కార్పెంటరీ ఉద్యోగావకాశాలు

పాతమంచిర్యాల: విదేశాలలో ఆస్ట్రేలియా, జర్మనీ, కెనడా, హంగేరీ, జపాన్, పోలాండ్, రుమేనియా, యూకే గల్ఫ్ దేశాల్లోని నిర్మాణ రంగంలో పనిచేయడానికి ఐటీఐ కార్పెంటరీ అర్హత గల వారు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి కౌశిక వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. విదేశాలలో పని చేయాలనుకునేవారు మూడేళ్ల ఒప్పంద కాలంలో పనిచేయాల్సి ఉంటుందని, సంవత్సరానికి జీతం రూ.30లక్షల వరకు ఉంటుందని, వయస్సు 35 ఏళ్లకు మించకుండా ఐటీఐ విద్యార్హత ఉండాలని, విదేశాలకు ప్రభుత్వం తరపున వివిధ పనుల నిమిత్తం వెళ్లడానికి రాష్ట్ర కార్మిక ఉపాధి శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టాంకాం)ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మిగతా వివరాలకు వెబ్‌సైట్ www.tomcom.telangana.gov.in ను సందర్శించాలని, ఫోన్ నంబర్ 7893566493, 8328602231లలో సంప్రదించాలన్నారు.

న్యాయం చేయాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న సతీశ్ కుటుంబీకులు

జైపూర్: మండలంలోని శెట్‌పల్లి గ్రామంలో ఈ నెల 17న కొరకొప్పుల సతీశ్‌గౌడ్ అనే యువకుడు బావిలో పడి అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. బుధవారం అతడి కుటుంబ సభ్యులు, స్థానికులు అదే గ్రామానికి చెందిన పులి శ్రీనివాస్‌గౌడ్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ అతడి ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. ఈ నెల 17న ఇద్దరు కలిసి నస్పూర్ పట్టణంలో బంధువుల శుభకార్యానికి హాజరై తిరిగి వస్తున్న క్రమంలో ఇద్దరు మద్యం సేవించి పులి శ్రీనివాస్‌గౌడ్ పొలం వద్ద ఉన్న బావి వద్ద కూర్చున్నారని, సతీశ్‌గౌడ్‌ను బావిలో శ్రీనివాస్‌గౌడ్ తోశాడని ఆరోపించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఇరుకుటుంబీకులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మృతుడి భార్య ఫిర్యాదుపై పూర్తిస్థాయిలో విచారణ చేసి నిందితులపై చర్యలు తీసుకుంటామని ఎస్సై ఉపేందర్ హామీ ఇచ్చారు.

వడదెబ్బతో ఒకరి మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

చింతలమానెపల్లి: మండలంలోని బాబాసాగర్ గ్రామానికి నెర్పెల్లి పెంటయ్య(58) బుధవారం వడదెబ్బతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... గ్రామంలోని బంధువులను కలిసేందుకు మధ్యాహ్నం ఇంటి నుండి నడుచుకుంటూ బయలుదేరాడు. స్థానిక చెరువు కట్ట వద్ద పడిపోయి ఉండడాన్ని గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూసే సరికి మృతిచెంది ఉన్నాడు. మృతుడికి భార్య కమల, నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

కొత్త బంగారులోకం



విద్యార్థులు (ఫైల్)



- టీనేజర్లు ఆకర్షణకు గురికావద్దు
- చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి
- ఇంటర్‌లో గాడితప్పితే భవిష్యత్ అంధకారమే
- క్రమశిక్షణతో సాగితేనే విజయం సొంతం
- జూన్ 1 నుంచి కళాశాలలు

ఆదిలాబాద్‌టౌన్: ఇప్పటి వరకూ పాఠశాల చదువు.. ఇకనుంచీ కళాశాల వాతావరణం.. ఇంటర్ విద్యార్థులకు ఇదో కొత్త అనుభవం.. ఈ క్రమంలో కొత్తగా కళాశాలల్లో చేరే విద్యార్థుల్లో పరిచయాలు.. కొత్త వాతావరణం, కొత్త పరిసరాలు, సరికొత్త ఆలోచనలు.. అన్నీ కొత్తదనాన్ని ఇచ్చే అనుభవాలే. ఇష్టపడి కళాశాలల్లో అడుగుపెట్టే విద్యార్థులకు ఇవన్నీ వింతగా కనిపిస్తాయి. టీనేజీలో అత్యంత కీలక సమయమిది. అంతేకాదు.. జీవితాన్ని మలుపులు తిప్పేది ఇంటర్ దశనే. ఏమాత్రం తొందరపాటు నిర్ణయం తీసుకున్నా జీవితం మన చేతిలోకి రానంత వెనక్కి వెళ్తుంది. పరాజయం బాటలో నిలుస్తుంది. ఇంటర్‌లో చేరే కొత్త విద్యార్థులు జాగ్రత్తలు పాటిస్తూ ఎలాంటి ఆకర్షణలు, ప్రలోభాలకు గురికాకుండా ముందుకెళ్తే ఇంటర్ దశ కొత్త బంగారు లోకం అవుతుంది. భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుంది. ఈ ఏడాది జూన్ 1 నుంచి కళాశాలలు ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది 31,959 మంది విద్యార్థులు పదోతరగతిలో ఉత్తీర్ణులయ్యారు. వీరంతా ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో చేరనున్నారు.

స్నేహం ప్రభావితం..

ఇంటర్‌లో చేరగానే విద్యార్థులను ప్రభావితం చేసే తొలి అంశం స్నేహం. అదృష్టం కొద్ది ఉన్నత భావాలున్న వారితో స్నేహం కుదిరితే జీవితం ప్రభావితం అవుతుంది. లేదంటే ప్రమాదంలో పడుతుంది.. లేదా పశ్చాత్తాప పడేలా చేస్తుంది. చదువుపై ఇష్టం, ప్రజలపై గౌరవం, సమాజం మీదా అవగాహన, లెక్చరర్లపై సదభిప్రాయం ఉన్న వారితో స్నేహం చేయాలి. అలాంటి దృక్పథంతోనే ముందుకు సాగాలి. లేదంటే చెడు వ్యసనాలకు అలవాటుపడి జీవితాలు అంధకారమయ్యే ప్రమాదం ఉంది. సిగరేట్లు, గుట్కాలు, మద్యం లాంటి వాటికి దూరంగా ఉంటే మంచిది. ఇలాంటి వాటికి ఇంటర్ దశలోనే బీజాలు పడతాయి. పరిచయం ఉన్నవారు, అపరిచిత వ్యక్తులతో సోషల్ మీడియా ద్వారా చాటింగ్ చేయవద్దు. అశ్లీలత వైపు మనసు మళ్లితే అంతే సంగతులు. పార్టీలు, వేడుకల పేరుతో స్నేహితులు చెడుదారుల వైపు తీసుకెళ్లే అవకాశాలు ఉంటాయి. జాగ్రత్తగా ఉండాలి. సినిమాల ప్రభావం, స్నేహితుల ప్రోత్సాహంతో ప్రేమాయనం అంటూ మనస్సును కలుషితం చేసుకోవద్దు.

ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు

జిల్లా	విద్యార్థులు
ఆదిలాబాద్	9,366
మంచిర్యాల	8,552
నిర్మల్	8,980
కుమురంభీం	5,061

చదువుకే తొలి ప్రాధాన్యం..

ఇంటర్ విద్యార్థులు ఎన్నో ఆకర్షణలకు లోనవుతారు. అయితే ఈ దశలో అందరికీ చదువే తొలి ప్రాధాన్యత కావాలి. తమ జీవితం అల్లరి పాలయ్యేలా ఉండకూడదు. సినిమాల్లో చూపించినట్లుగా కాలేజీలు ఎగ్గొట్టడం, హీరోయిజం చేయడం కాదనే విషయాన్ని తప్పనిసరిగా తెలుసుకోవాలి. విధిగా తరగతులకు హాజరు కావాలి. పాఠ్యాంశాలపై దృష్టి సారించాలి. లెక్చరర్లు ఇచ్చే నోట్స్ ఎప్పటికప్పుడు రాసుకోవాలి. పోటీ పరీక్షలకు అనుగుణమైన ప్రణాళిక రూపొందించుకోవాలి. స్నేహితులతో కలిసి గ్రూప్ స్టడీ చేయడం అత్యంత కీలకం.

ఆకర్షణకు లోనుకావొద్దు..



ఇంటర్ చదివే విద్యార్థులు ఎక్కువగా ఆకర్షణకు లోనవుతారు. దీంతో చదువుపై శ్రద్ధ కనబర్చలేరు. చిన్న వయస్సులోనే ప్రేమ, పెళ్లితో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారు. చెడు వ్యసనాల బారిన పడకుండా చదువుపై దృష్టి పెట్టాలి. భవిష్యత్‌ను చక్కదిద్దుకోవాలి.

– డాక్టర్ రమ, గైనకాలజిస్ట్

ఏదో తెలియని లోకంలా..



పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు ఇంటర్‌కు రాగానే ఏదో తెలియని లోకంలా విహరిస్తారు. స్వేచ్ఛ జీవిగా భావిస్తారు. అప్పుడే వారి ఆలోచనల్లో మార్పులు వస్తాయి. కాలేజీ చదువు ఎంతో విలువైనది. ముఖ్యంగా చెడు వ్యసనాలు, సిగరేట్లు, మద్యం సేవించడం, కళాశాలకు డుమ్మా కొట్టడం వంటి వాటికి గురికాకుండా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి. అప్పుడప్పుడు తల్లిదండ్రులు కళాశాలకు వెళ్లి పిల్లల తీరును పర్యవేక్షించాలి.

– డాక్టర్ ఓంప్రకాష్, సైక్రియాట్రిస్ట్

భవిష్యత్ అంధకారం చేసుకోవద్దు



ఎస్సెస్సీ తర్వాత కొత్త ప్రపంచంలోకి అడుగుపెడతారు. ఇంటర్‌లో కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోవాలి. ప్రేమ, సినిమా, షికార్ల వైపు దృష్టి మళ్లే వయస్సు ఇది. అటుగా దృష్టిసారిస్తే భవిష్యత్ అంధకారం అవుతుంది. పదో తరగతి వరకు ఉపాధ్యాయులు స్థానికంగా ఉండడంతో విద్యార్థులకు భయం అనేది ఉంటుంది.

– సూర్యప్రకాశ్, ప్రిన్సిపాల్

తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న ప్రతినిధులు

తాండూర్: మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌ను బుధవారం వరల్డ్ బ్యాంకు ప్రతినిధులు సందర్శించారు. న్యూయార్క్‌ల నుంచి వచ్చిన వరల్డ్ బ్యాంక్ ప్రతినిధులు నిర్మల వెదుల, దీపక్ అలోక్, గౌవర్ బామ్మీ తెలంగాణ గ్రామీణ బ్యాంకును సందర్శించి బ్యాంక్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బ్యాంక్ పరిధిలో నిర్వహిస్తున్న కస్టమర్ సర్వీస్ పాయింట్ యూనిట్‌లను ప్రత్యక్షంగా పరిశీలించారు. కస్టమర్లకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. బ్యాంక్ లింకేజీ ద్వారా పల్లె ప్రాంతాల్లో మహిళల ఆర్థిక స్వావలంబన, స్వ యం ఉపాధి కల్పన కోసం రుణాల మంజూ రు, రికవరీ, ఇన్సూరెన్స్ కల్పించడంలో కస్టమర్ సర్వీసు పాయింట్ అందిస్తున్న సేవల ను పనితీరును పర్యవేక్షించారు. ఇందులో జీ ఎం ఐటీ విభాగం అధికారి వీఎస్ మహేష్, రీజినల్ మేనేజర్ టి.మురళీ మనోహర్‌రావు, బ్యాంకు చీఫ్ మేనేజర్ ప్రభుదాస్, సీఎస్పీలు తిరుపతి, శరత్ ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నస్పూర్: శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బుధవారం లభ్యమైంది. ఎస్సై రాజేశ్ వివరాల ప్రకారం... శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 6గని కాన్పూర్ గ్రామ సమీపంలోని రిజర్వు ఫారెస్టు ఏరియాలో మృతదేహాన్ని గమనించిన గొర్రెల కాపరులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 60 నుంచి 70ఏళ్లు ఉంటుందని తెలిపారు. మృతదేహానికి ఘటన స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించి పూడ్చివేశారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రిపుల్‌ఐటీలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల



నోటిఫికేషన్ విడుదల చేస్తున్న ట్రిపుల్‌ఐటీ అధికారులు

- ఈ నెల 5నుంచి దరఖాస్తుల స్వీకరణ
- 26న ఎంపిక జాబితా విడుదల
- నోటిఫికేషన్ విడుదల చేసిన వీసీ

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం బుధవారం యూనివర్సిటీ పరిపాలన భవనంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో వీసీ వెంకటరమణ, డైరెక్టర్ ప్రొఫెసర్ సతీశ్‌కుమార్, క్యాంపస్ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ వెంకటరమణ మాట్లాడుతూ.. పదో తరగతిలో వచ్చిన జీపీఏ ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ ప్రవేశాల ప్రక్రియ చేపడతామని పేర్కొన్నారు. 1,605 సీట్లు ఈ విద్యా సంవత్సరానికి అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ నెల 5నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. 1,404 జనరల్ సీట్లు, స్పెషల్ కేటగిరీ కింద 96, గ్లోబల్ కోటాలో 105 సీట్లు, మొత్తంగా 1,605 సీట్లు భర్తీ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ట్రిపుల్‌ఐటీలో చేరాలనుకునే విద్యార్థులు ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ల ద్వారా సంస్థ వెబ్‌సైట్ లింక్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రవేశాలకు సంబంధించి మూడు పేజీల దరఖాస్తు ప్రతి ట్రిపుల్‌ఐటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంది. వెబ్‌సైట్‌లో కాలమ్‌లో అడిగిన వివరాలు నమోదుచేసి ప్రింట్ తీసుకుని ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలను ట్రిపుల్‌ఐటీ అధికారులకు రిజిష్టర్, స్పీడ్ పోస్ట్ ద్వారా పంపించాలి.

ఈ నెల 16వరకు దరఖాస్తు గడువు

ట్రిపుల్‌ఐటీలో 1,404 జనరల్ సీట్ల కోసం రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా జూన్ 19వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులు సీఏపీ, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ కోటా అభ్యర్థులకు ఈ నెల 24వరకు దరఖాస్తు గడువు ఉంది. ఈ నెల 26న ఎంపికైన విద్యార్థుల జాబితాను ట్రిపుల్‌ఐటీ అధికారులు ప్రకటించనున్నారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల సందేహాలు నివృత్తి చేసేందుకు మూడు హెల్ప్‌లైన్ నంబర్లను అందుబాటులో ఉంచనున్నారు. ఏ సమస్యలున్నా 7416002245, 7416058245, 741612245 నంబర్లకు కాల్ చేయవచ్చని అధికారులు తెలిపారు. పూర్తి వివరాలకు www.rgukt.ac.in / www.admissions.rgukt.ac.in లో చూడాలని సూచించారు.

విద్యావిదానం ఇదీ..

ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ కోర్సులో భాగంగా మొదటి రెండేళ్లు ఇంటర్ తత్సమాన పీయూసీ కోర్సు బోధిస్తారు. అనంతరం పీయూసీలో మెరిట్ ఆధారంగా మరో నాలుగేళ్ల ఇంజినీరింగ్ సీట్లను ఎంపిక చేసుకోవచ్చు. పీయూసీ విద్య అనంతరం మెరుగైన అవకాశాలు వస్తే విద్యార్థులు ఇక్కడి నుంచి బయటకు వెళ్లి చదువుకునే వెసులుబాటు కూడా ఉంది. నాలుగేళ్ల బీటెక్‌లో సివిల్, కెమికల్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, ఐటీ, ఈసీఈ, ఎంఎంఈ కోర్సులు అందిస్తున్నారు. మొదటి రెండేళ్ల పీయూసీలో సాధించిన మార్కుల ఆధారంగానే బీటెక్‌లో కోర్సులు కేటాయిస్తారు. ఇక్కడ ఎంపికైన విద్యార్థులకు బాసర ట్రిపుల్‌ఐటీ అధికారులు అన్ని వసతులు సమకూరుస్తారు. ల్యాప్‌టాప్‌తోపాటు యూనిఫాంలు, షూస్, స్పోర్ట్స్ డ్రెస్ అందిస్తారు. హాస్టల్, భోజన వసతి యూనివర్సిటీయే కల్పిస్తుంది. విద్యార్థుల కోసం శారీరక, మానసిక వికాసానికి ఆటలు, వ్యాయామం, సాంస్కృతిక రంగాల్లో రాణించేందుకు తరగతులు నిర్వహిస్తున్నారు. బాసర ట్రిపుల్‌ఐటీలో ప్రత్యేక వైద్యశాల, అధునాతన ల్యాబ్‌లు, డిజిటల్ లైబ్రరీలు అందుబాటులో ఉన్నాయి.

కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

భీమారం: మండలంలోని మద్దికల్ గ్రామంలో ధాన్యం బస్తాలను తరలిస్తున్న లారీ బుధవారం రోడ్డుపక్కనే గల విద్యుత్ స్తంభానికి ఢీకొనడంతో స్తంభం లారీపై పడింది. ఈ విషయాన్ని స్థానికులు విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించడంతో సరఫరా నిలిపివేశారు. మద్దికల్ గ్రామంలోని ధాన్యం కేంద్రాల్లో కొనుగోలు చేసిన బస్తాలను లారీల ద్వారా కరీంనగర్ జిల్లాలోని రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో రోడ్డు పరిధిలోనే స్తంభం ఉండడంతో దానిని తప్పించే ప్రయత్నం చేసినప్పటికీ బస్తాలు తగిలి స్తంభం లారీపై పడింది. విద్యుత్ స్తంభం విరిగిన అనంతరం లారీని పక్కకు తీసేందుకు ప్రయత్నించగా విద్యుత్ లైను మొత్తం కిందపడిపోయే ప్రమాదం ఉండడంతో లారీని అలాగే ఉంచారు.



కరెంట్ స్తంభానికి ఢీకొట్టిన ధాన్యం బస్తాల లారీ

చెప్పినా పట్టించుకోవడం లేదు

గ్రామంలో రోడ్డు పరిధిలోని విద్యుత్ స్తంభాలను తొలగించి కొంత దూరంలో ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. విద్యుత్‌శాఖ అధికారులు ఇప్పటికే స్పందిస్తే ఈ ప్రమాదం జరిగేది కాదు. – ఓదేటి వాణి, సర్పంచ్, మద్దికల్

చెట్టును ఢీకొన్న లారీ... డ్రైవర్ మృతి

లక్సెట్టిపేట: మండలంలోని గుల్లకోట బస్టాప్ వద్ద బుధవారం అదుపుతప్పి ఇసుక లారీ చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ కృష్ణస్వామి(35) మృతి చెందాడు. ఎస్సై లక్ష్మణ్ కథనం ప్రకారం.. చెన్నూర్ నుంచి ఇసుక లోడ్‌తో నిర్మల్ వెళ్తున్న లారీ అదుపు తప్పి గుల్లకోట వద్ద రోడ్డుపక్కన ఉన్న చెట్టును వేగంగా ఢీకొట్టింది. దీంతో లారీ క్యాబిన్ నుజ్జునుజ్జయింది. ఇందులో డ్రైవర్ ఇరుక్కుని అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ మృతదేహాన్ని జేసీబీ సాయంతో బయటకు తీశారు. కృష్ణస్వామి నిర్మల్ పట్టణానికి చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు ఎస్సై పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



చెట్టుకు ఢీకొన్న లారీ

శ్రీరాంపూర్‌లో 92శాతం ఉత్పత్తి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ డివిజన్ గనుల్లో మే నెలలో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యంలో 92శాతం సాధించినట్లు ఏరియా జీఎం బి.సంజీవరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మే నెల 6.26 లక్షల టన్నులకు 5.79 లక్షల టన్నులు సాధించినట్లు తెలిపారు. కేవలం భూగర్భగనులు మాత్రం నిర్దేశించిన లక్ష్యంలో 103శాతం సాధించడం జరిగిందన్నారు. ఇందారం ఓసీపీ 107 శాతం, శ్రీరాంపూర్ ఓసిపి 83 శాతం సాధించడం జరిగిందన్నారు. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిలో ఓబీ పనుల్లో జాప్యంతో అనుకున్న లక్ష్యాన్ని సాధించలేకపోయామన్నారు. ఇదిలా ఉంటే ఈనెల 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం ఏడు గంటలకు నస్పూర్ కాలనీలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాల వేసి అక్కడి నుంచి కార్మిక వాడల మీదుగా జీఎం కార్యాలయం వరకూ ర్యాలీ ఉంటుందని తెలిపారు. జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలవేసి అనంతరం అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించనున్నట్లు తెలిపారు. ఈ నెల 5 న సింగరేణి సంబరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాల్సిందిగా కోరారు. సమావేశంలో డీజీఎం (పర్సనల్) అరవింద్ రావు డీజీఎం (ఐఈడి) చిరంజీవి, సీనియర్ పీవో కాంతారావు పాల్గొన్నారు.

నూతన నియామకం



నియామక పత్రం అందిస్తున్న శ్రీనివాస్

పాతమంచిర్యాల: బీసీ సంఘాల ఐక్యవేదిక లీగల్ అడ్వైజర్‌గా అడ్వకేట్ రెడ్డిరాజుల రాములును నియమించినట్లు బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్మల శ్రీనివాస్ తెలిపారు. బీసీ సమాజానికి న్యాయ సాయం అందించడానికి బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా రాములు సేవలందిస్తారన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కో-కన్వీనర్ సంగం లక్ష్మణ్, నాయకులు ఒడ్డెపల్లి మనోహర్, నస్పూరి అఖిల్, జంబోజు శ్రీనివాస్ అడ్వకేట్లు రంగు మల్లేష్, భుజంగరావు, కనకయ్య, పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి

తాండూర్: మండలంలోని కిష్టంపేట గ్రామంలో ఓ యువకుడు విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. ఎస్సై రాజశేఖర్ వివరాల ప్రకారం... కిష్టంపేట గ్రామానికి చెందిన రాజు(20) కూలీ పనులు చేసుకుని జీవిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన కామిని శ్రీనివాస్ ఇంటి నిర్మాణ పనులకు కూలీగా వెళ్తున్నాడు. బుధవారం పనులు ముగించుకుని కాళ్లు చేతులు శుభ్రం చేసుకునేందుకు విద్యుత్ మోటారు ఆన్‌చేయగా విద్యుత్ షాక్ తగిలి కిందపడిపోయాడు. స్థానికులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ అదుపు తప్పి వాటర్‌మెన్ మృతి

రెబ్బెన(ఆసిఫాబాద్): బైక్ అదుపు తప్పి బోల్తాపడటంతో నంబాల గ్రామానికి చెందిన వాటర్‌మెన్ దుర్గం దేవాజీ (61) మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం... నంబాలలోని బాలాజీనగర్‌కు చెందిన దేవాజీ పంచాయతీలో వాటర్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ఆసిఫాబాద్‌లో పెళ్లికి వెళ్లి తిరిగి బైక్‌పై వస్తుండగా ఇందిరానగర్ వద్ద అదుపు తప్పి కిందపడగా తలకు తీవ్రగాయమైంది. స్థానికులు 108లో రెబ్బెన పీహెచ్‌సీకి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య సుశీల, కుమారుడు, కూతురు ఉన్నారు.

కోతకు గురైన తాత్కాలిక వంతెన



కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని అందవెల్లి పెద్ద వాగులో ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన బుధవారం కోతకు గురైంది. కురిసిన అకాల వర్షాలతో పెద్దవాగులో నీటిమట్టం పెరిగింది. దీంతో తాత్కాలిక వంతెన కోతకు గురైంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. ద్విచక్ర వాహనాలు మినహా వేరే వాహనాలు ఈ మార్గంలో వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. శుక్రవారం వరకూ రాకపోకలు పునఃప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి.

బొగ్గు ఉత్పత్తి పెంచాలి

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని భూగర్భ గనుల్లో బొగ్గుఉత్పత్తి పెరుగుదలకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఏరియా జీఎం మోహన్‌రెడ్డి కోరారు. బుధవారం ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గత మాసం బొగ్గు ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. మేలో మందమర్రిలోని రెండు ఓసీల్లో 100శాతం ఉత్పత్తి సాధించగా ఏరియా వ్యాప్తంగా 90శాతం ఉత్పత్తి సాధించామని తెలిపారు. మరో ఏడాదిన్నర కాలం తరువాత ఆర్కే ఓసీ మూతపడే అవకాశం ఉందన్నారు. భూగర్భ గనుల్లో బొగ్గు ఉత్పత్తి పెరుగుదలకు, ఆర్కే ఓసీ కాలపరిమితి మరికొంత కాలం ఉండేలా ప్రణాళికలు చేస్తున్నామని తెలిపారు. పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఐఈడీ రాజన్న, కేకే-ఓసీ పీవో రమేష్, ఆర్కే-ఓసీ పీవో గోవిందరావు, డీవైపీఎం మైత్రేయబంధు, అధికారులు శ్రీనివాసులు ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న జీఎం మోహన్‌రెడ్డి